# ఇస్లామీ వ్యవస్థలో ముస్లిమేతరుల హక్కులు

189

Islami Hukumath mein
Ghair Muslimonke Huqooq
(Telugu)

# ఇస్లామీ వ్యవస్థలో ముస్లిమేతరుల హక్కులు

మూలం

**మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూదీ**

అనువాదం

**ముహమ్మద్ గౌస్‌ఖాన్**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

**Islami Vyavastalo Muslimetarula Hakkulu**

*Islami Hukumath mein*
*Ghair Muslimonke Huqooq (Telugu)*

**TIP Series No.** : **189**

Written by : Moulana Syed Abul Ala Moududi

Translated by : Mohd. Ghouse Khan

*All Rights Reserved with Publishers*

2nd Edition : January 2017

Copies : 2000

**Price** : **Rs. 25**

ISBN : 81-88241-87-3

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# విషయసూచిక


| | |
|---|---|
| ముందుమాట | 05 |
| అధ్యాయం- 1 | 07 |
| ముస్లిమేతర ప్రజల రకాలు | 07 |
| ఒడంబడికలు | 07 |
| జయింపబడినవారు | 09 |
| అధ్యాయం-2 | 12 |
| ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరుల | |
| సాధారణ హక్కులు | 12 |
| ప్రాణరక్షణ | 12 |
| నేర (క్రిమినల్) చట్టాలు | 14 |
| పౌర చట్టాలు | 15 |
| గౌరవమర్యాదల రక్షణ | 15 |
| వాగ్దాన స్థిరత్వం | 15 |
| వ్యక్తిగత వ్యవహారాలు | 16 |
| మతపరమైన ఆచారాలు | 18 |
| ఆరాధనాలయాలు | 18 |
| పన్ను, కప్పంలో రాయితీ (తగ్గింపు) | 19 |
| వ్యాపార పన్ను | 22 |
| సైనికుల సేవలు- అపవాదం | 22 |

| | |
|---|---|
| **అధ్యాయం- 3** | **25** |
| ఇస్లాం ధర్మవేత్తలు- రక్షణ | 25 |
| **అధ్యాయం- 4** | **27** |
| ముస్లిమేతరులు- అదనపు అధికారాలు | 27 |
| ప్రభుత్వ నాయకుని పదవి | 27 |
| శాసనసభా సంఘం | 27 |
| వ్రాతపూర్వకమైన మరియు వాక్ స్వాతంత్ర్యం | 29 |
| విద్య | 30 |
| ఉద్యోగాలు | 30 |
| ఆర్థిక వ్యవహారాలు, వృత్తులు | 31 |
| ముస్లిమేతరుల రక్షణ చట్టం | 31 |

# ముందుమాట

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే- ఏ దేశాలలో ముస్లింలు అల్ప సంఖ్యాకులుగా ఉన్నారో, అక్కడి అధిక సంఖ్యాకులు ముస్లింల హక్కులను హరించడంలో, వారి నాగరికత (గౌరవమర్యాదల)ను తుడిచిపెట్టడంలో నిమగ్నమై ఉన్నారు. ముస్లిం రాజ్యాలలో ఉన్న అల్పసంఖ్యాకులు మాత్రం ఎంతో హాయిగా జీవిస్తున్నారు. కారణం ఇస్లాం ముస్లిమేతరుల గురించిన ఆదేశాలను స్పష్టంగా ముందుగానే తెలియజేసింది.

ఈ మధ్యకాలం (6 డిసెంబర్ 1992)లో బాబరీమస్జిద్‌పై జరిగిన సంఘటన సెక్యులరిజం పునాదులను కుదిపివేసింది. మన రాజ్యాంగం, న్యాయస్థానాలు తలపెట్టినటువంటి అగౌరవపు ఉదాహరణలు చాలా అరుదుగా దొరుకుతాయి. అయితే ఆ సందర్భంలో కొందరు ముస్లింల వైఖరి, వారి ప్రదర్శనాతీరు ఎంతో చింతించవలసిన విషయం. ఈ విషయమే మీ చేతిలో ఉన్న ఈ చిరుపుస్తకం ప్రచురణకు పురిగొలిపింది.

ముస్లిం సమాజం శాంతి సంక్షేమాల కోసం ఉనికిలోకి వచ్చింది. ఈ సమాజం మంచిని పెంచడానికి, చెడును రూపుమాపడానికి ఉద్భవించింది. శాంతిశ్రేయోభిలాషి అయిన ఈ సమాజం కూడా ఆవేశ ప్రవాహంలో కొట్టుకొనిపోతే, న్యాయస్థాపన కోసం ఇంకెవరిపై నమ్మకం ఉంచగలం?

ఇస్లాం గురించి తప్పుడు భావాలు, అభిప్రాయాలు ఏర్పడకుండా ఉండేందుకు, మనం ముస్లిమేతరుల హక్కులను గురించి తెలుసుకో వలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ పుస్తకం ఈ విషయాన్నే స్పృశిస్తుంది. ఇన్షాఅల్లాహ్ ఈ పుస్తకాన్ని ఆంగ్లం, హిందీలలో కూడా త్వరలోనే ముద్రిస్తాం.

- ప్రకాశకులు

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## అధ్యాయం- I

# ముస్లిమేతర ప్రజల రకాలు

ఇస్లామీయ ధర్మశాస్త్రం తోటి ముస్లిమేతర సోదరులను మూడు రకాలుగా విభజిస్తుంది.

1. ఏదయినా సంధి లేదా ఒడంబడిక వల్ల ఇస్లామీయ రాజ్య పరిధిలోకి రావడం.
2. యుద్ధంలో ఓటమిపాలై లొంగిపోవడం.
3. యుద్ధం, సంధికాక ఇతర సాధనం ద్వారా ఇస్లామీయ రాజ్యంలో కలవడం.

ఇస్లామీయ రాజ్యంలోని ఈ మూడు రకాల ముస్లిమేతరులు సాధారణ హక్కుల విషయంలో అందరూ సమానమే. అయితే, మొదటి రెండు వర్గాల ఆజ్ఞలలో కాస్తా తేడా ఉంది. అందువల్ల ముస్లిమేతరుల హక్కులను వివరంగా తెలిపే ముందు ఈ ప్రత్యేక వర్గాల గురించిన ఆజ్ఞలను తెలియజేస్తాను.

## ఒడంబడికలు

యుద్ధం జరగకుండా లేదా యుద్ధసమయంలో కొన్ని షరతులపై ఇస్లామీయ రాజ్యానికి విధేయులయ్యే ముస్లిమేతరుల విషయంలో- వారి వ్యవహారాలన్నీ నిర్ణీత షరతులకు లోబడే ఉంటాయని ఇస్లాం ధర్మశాస్త్రం తెలియజేస్తుంది. శత్రువును విధేయతకై సంసిద్ధం చేయడానికి కొన్ని ఉదార

షరతులను నిర్ణయించి, వారు పూర్తిగా అధీనంలోకి వచ్చిన తరువాత వారితో మరొక రకమైన వైఖరి అవలంబించడం ఈనాటి నాగరిక జాతుల రాజకీయ వ్యవహారమైపోయింది. కాని ఇస్లాం ఈ వైఖరిని అధర్మమైనదిగా, ఘోర పాపకార్యంగా పరిగణిస్తుంది. ఇస్లాం పద్ధతి ప్రకారం ఏదయినా జాతితో కొన్ని షరతులు నిర్ణయమైతే, ఆ తరువాత ఆ జాతి ఎంత శక్తిమంతమైనదైనా, నమ్మ దగినదైనా, కాకపోయినా నిర్ణీత షరతులలో ఏ షరతునూ ఉల్లంఘించడం జరగదు. మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలియజేశారు:

"మీరు ఏదయినా జాతితో యుద్ధం చేసి గెలుపొందితే ఆ జాతి తన ప్రజల ప్రాణాలను కాపాడుకోవడానికి కప్పం (పన్ను) చెల్లిస్తానని ఒప్పుకుంటే, (మరో హదీసులో మీతో సంధి కుదుర్చుకుంటే) ఆ తరువాత నిర్ణీత కప్పానికి కొంచెం కూడా ఎక్కువ తీసుకోరాదు. ఎందుకంటే అది మీ కొరకు అధర్మ మైనది." (అబూదావూద్, కితాబుల్ జిహాద్)

మరో హదీసులో మహనీయులు ముహమ్మద్(స) ఇలా తెలిపారు:

"జాగ్రత్త! ఎవరైతే ఏదయినా ఒడంబడికదారునిపై దౌర్జన్యం చేస్తాడో లేదా అతని హక్కులను తక్కువ చేస్తాడో లేదా అతని శక్తికంటే ఎక్కువ భారం వేస్తాడో, లేదా అతని ఏదయినా వస్తువు అతని ఇష్టానికి వ్యతిరేకంగా వసూలు చేస్తాడో, ప్రళయదినాన అతనికి వ్యతిరేకంగా నేను స్వయంగా న్యాయాన్ని కోరుతాను." (అబూదావూద్, కితాబుల్ జిహాద్)

ఈ రెండు హదీసుల పదాలు సాధారణమైనవి. ఇస్లామీ రాజ్యంలో ముస్లిమేతరులతో సంధిలో కుదుర్చుకున్న షరతులలో ఎలాంటి హెచ్చు తగ్గులు చెయ్యడం ధర్మసమ్మతం కాదని ఈ వచనాల ద్వారా తెలుస్తుంది. వారిపై పన్ను పెంచరాదు, వారి భూఆక్రమణ చెయ్యరాదు, వారి కట్టడాలను దోచుకోరాదు. వారిపై సైన్యపు బలమైన నియమాలు విధించరాదు, వారి మతంలో జోక్యం చేసుకోరాదు. వారి గౌరవ మర్యాదలపై దాడిచెయ్యరాదు.

వారిపై దౌర్జన్యం చెయ్యరాదు. వారికి కష్టం కలిగించరాదు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇస్లామీయ ధర్మవేత్తలు నీతినిజాయితీగా గెలుపొందిన జాతుల నియమాలలో ఎలాంటి సంకలితం చెయ్యలేదు. అలాగే వారితో మన వ్యవహారం, సంధిలో కుదుర్చు కున్న షరతుల ప్రకారమే ఉంటుంది.

ఇమాం అబూ యూసుఫ్(రహ్మ) ఇలా రాశారు.

"వారితో సంధిలో కుదుర్చుకున్నదే తీసుకోవడం జరుగుతుంది. సంధిలోని షరతులన్నీ నెరవేర్చబడతాయి. ఇంకా వారిపై ఎలాంటి అధిక్యం (రెట్టింపు) చెయ్యడం జరగదు." *(కితాబుల్ ఖరాజ్. పేజి. 35)*

## జయింపబడినవారు

చివరి సమయం వరకు ముస్లింలతో యుద్ధం చేస్తున్నవారు రెండవ వర్గానికి చెందినవారు. ఇస్లామీయ సైన్యం వారి బలాలను చిత్తుచేసి, విజయభేరి మ్రోగిస్తూ వారి పట్టణాలలోనికి దూసుకొని వెళ్ళినప్పుడు తమ ఆయుధాలను క్రిందపడేసినవారు వీరు. ఇలాంటి ముస్లిమేతరులను ఇస్లామీయ రాజ్యంలో ఉంచుకున్నట్లయితే, వారికి కొన్ని ప్రత్యేకమైన హక్కులు కల్పించబడతాయి. వాటి వివరాలు ఇస్లామీయ ధర్మశాస్త్ర గ్రంథాలలో ఉన్నాయి. క్రింద వాటి సారాంశం ఇవ్వబడింది. దీనివల్ల ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరుల శక్తి సామర్థ్యాలు తేటతెల్లమవుతాయి.

1. ఒక ముస్లిం నాయకుడు వారితో పన్ను ఒప్పందం చేసుకుంటే, వారు శాశ్వతంగా రక్షించబడాలి. వారి ధనప్రాణాలను రక్షించడం ముస్లింల విధి అవుతుంది. ఎందుకంటే పన్ను ఒప్పందం జరిగిన వెంటనే వారి ధన ప్రాణాలు పరిరక్షించబడాలి. (బదాయుల్ సనాయి, సం.7, పేజి- 111)దాని తరువాత నాయకుడు లేదా ముస్లింలకు వారి దేశాలను ఆక్రమించుకునే లేదా వారిని బానిసలుగా చేసుకునే ఎలాంటి హక్కు ఉండదు. హజ్రత్ ఉమర్(రజి), హజ్రత్ ఉబైదా(రజి)కు ఇలా రాశారు:

"వారితో పన్ను ఒప్పందం చేసుకున్న తరువాత వారిని పీడించే హక్కు మీకు లేదు."

2. ఒప్పందం నిర్ణయమైన తరువాత వారి భూములకు యజమానులు వారే అవుతారు. వారి స్థిరాస్థి వారి వారసులకే మార్పు చేయబడుతుంది. ఇంకా తమ ఆస్తిపాస్తులను క్రయవిక్రయాలు చెయ్యడానికి, వాటిని దానం చెయ్యడానికి, తాకట్టుపెట్టడానికి వారికి సర్వహక్కులూ ఉన్నాయి. వీటిని కాకుండా చేసే హక్కు ఇస్లామీయ రాజ్యానికి లేదు.

*(ఫత్‌హుల్ ఖదీర్- సంపుటి4, పేజి. 359)*

3. వారి ఆర్థిక స్థోమతనుబట్టి పన్ను నిర్ణయించబడుతుంది. ధనికుల నుండి ఎక్కువ, మధ్యతరగతికి చెందిన వారినుండి తక్కువ, పేదవారినుండి చాలా తక్కువ తీసుకోబడుతుంది. ఆదాయ మార్గం లేనివారికి, ఆర్థిక అవసరాల కోసం ఇతరులపై ఆధారపడే వారికి పన్ను మాఫీ చేయబడుతుంది. పన్ను ప్రత్యేకంగా నిర్ణయించబడదు. పన్ను నిర్ణయించేటప్పుడు దానిని సులభంగా చెల్లించే విధంగా నిర్ణయించాలి. హజ్రత్ ఉమర్(రజి) ధనికులపై నెలకు ఒక రూపాయి, మధ్యతరగతివారికి నెలకు యాభై పైసలు, బీదలకు నెలకు ఇరవై అయిదు పైసల పన్ను నిర్ణయించారు.

*(కితాబుల్ ఖరాజ్, పేజి. 36)*

4. యుద్ధం చేయగలిగే వారిపై మాత్రమే పన్ను విధించబడుతుంది. పిల్లలు, స్త్రీలు, పిచ్చివారు, గుడ్డివారు, వికలాంగులు, ఆరాధనాలయాల సేవకులు, సన్యాసులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, బానిసలు పన్ను నుండి మినహాయించబడ్డారు. *(బదాయి, సంపుటి 7, పేజి 111-113, ఫత్‌హుల్ ఖదీర్ సంపుటి 4, పేజి. 372, 373, కితాబుల్ ఖరాజ్ పేజి 73)*

5. కరవాలంతో గెలుపొందిన పట్టణాలను స్వాధీనపరుచుకునే హక్కు ముస్లింలకు ఉంది. అయితే, ఆ హక్కుతో లాభం పొందరాదు. వారిని మంచి

స్థితిలో ఉండనివ్వాలి. హజ్రత్ ఉమర్(రజి) కాలంలో ముస్లింలు ఎన్నో దేశాలను జయించారు. కాని ఆ దేశాలలోని ఏ ఒక్క ఆరాధనాలయాన్ని ధ్వంసం చేయలేదు. వాటికి ఎలాంటి నష్టమూ కలిగించలేదు. ఇమాం అబూ యూసుఫ్ (రహ్మ) ఇలా రాశారు.

"వాటిని వాటి స్థితిపై వదిలివెయ్యడం జరిగింది. వాటిని నాశనం చెయ్యడంగాని, నష్టపరచడంగాని జరుగలేదు." *(కితాబుల్ ఖరాజ్, పేజి. 83)*

ఏదిఏమయినా ప్రాచీన ఆరాధనాలయాలను నాశనం చెయ్యడం ధర్మసమ్మతంకాదు. *(బదాయి సంపుటి-7, పే. 114)*

అధ్యాయం- 2

# ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరుల సాధారణ హక్కులు

ఇస్లామీయ రాజ్యంలో ఉన్న మూడు రకాల ముస్లిమేతర బాధితుల హక్కుల గురించి తెలుసుకుందాం.

## ప్రాణరక్షణ

ముస్లిమేతరుల రక్తం ముస్లింల రక్తానికి సమానం. ఎవరయినా ఒక ముస్లిం ఒక ముస్లిమేతరుణ్ణి హత్య చేసినట్లయితే దానికి శిక్ష, ఒక ముస్లిం తోటిముస్లింని హత్య చేసినప్పుడు విధించే శిక్షే ఉంటుంది. దైవప్రవక్త(స) కాలంలో ఒక ముస్లిం ఒక ముస్లిమేతరుడ్ని హత్యచేశాడు. అప్పుడు ఆయన (స)- హంతకుడయిన ఆ ముస్లింని హతమార్చాలని ఆదేశించారు. ఇంకా ఇలా తెలిపారు:

**అనా అహఖ్ఖుమన్ వఫా బిజిమ్మతిహీ** (ఇనాయ షరహ్ హిదాయ సంపుటి 8. పే. 256, ఇదే హదీసు ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం 'దారెఖుత్నీ' నఖలు చేశారు. అందులో- **'అనా అక్రముమన్ వఫా బిజిమ్మతిహి"** అని వచ్చింది)

"బాధితుని మాటను నిలుపుకోవడంలో అందరికంటే ఎక్కువ హక్కు దారుడ్ని నేనే."

హజ్రత్ ఉమర్(రజి) పరిపాలనా కాలంలో బక్ర్ బిన్ వాయిల్ వంశానికి చెందిన ఒక వ్యక్తి 'హీరా' ప్రాంతానికి చెందిన ఒక ముస్లిమేతరుడ్ని హత్య చేశాడు. అప్పుడు హజ్రత్ ఉమర్(రజి) హంతకుడ్ని హతుని వారసులకు అప్పగించమని ఆదేశించారు. వారా హంతకుడిని హత్యచేశారు.

*(బుర్హాన్ షరహ్ మవాహిబుర్రహ్మాన్ సంపుటి 3 పేజి 287)*

హజ్రత్ ఉస్మాన్(రజి) పాలనాకాలంలో ఉబేదుల్లా బిన్ ఉమర్ (రజి)కు మరణశిక్ష విధించాలని తీర్పు ఇవ్వబడింది. దానిక్కారణం హజ్రత్ ఉమర్(రజి)ను హత్యచేయడానికి జరిగిన కుట్రలో హర్మజాన్, అబూలూలు కుమార్తె పాల్గొన్నారన్న అనుమానంతో ఉబేదుల్లా బిన్ ఉమర్(రజి) వారిద్దరినీ హతమార్చడమే.

హజ్రత్ ఉమర్(రజి) గారి కాలంలో ఒక ముస్లిమేతరుడిని హత్య చేశాడని ఒక ముస్లింపై నేరారోపణ మోపబడింది. సాక్ష్యాధారాలు అందిన తరువాత హజ్రత్ ఉమర్(రజి) ఆ ముస్లింకు మరణశిక్ష విధించాలని ఆదేశించారు. అయితే హతుడి సోదరుడు వచ్చి "నేను నిందితుడు చేసిన హత్యను క్షమించాను" అన్నాడు.

అయితే హజ్రత్ ఉమర్(రజి) దాంతో సంతృప్తిచెందక "బహుశా వారు నిన్ను బెదిరించి ఉండవచ్చు" అన్నారు.

"లేదు. నన్నెవరూ బెదిరించలేదు. నాకు రక్త పరిహారం లభించింది. నేనీ హంతకుడ్ని చంపి ప్రతీకారం తీర్చుకున్నంత మాత్రాన నా తమ్ముడు బ్రతికిరాడుగదా!" అన్నాడు హతుడి సోదరుడు.

అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) హంతకుడ్ని విడిచిపెట్టారు. తరువాత ఇలా అన్నారు: "మన ముస్లిమేతరుల రక్తము మన రక్తంలాంటిదే. వారి జరిమానా మన జరిమానా లాంటిదే." *(బుర్హాన్ సంపుటి 2, పేజి. 282)*

ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ అలీ(రజి) ఇలా అన్నారు: "వారు మనతో సంధి చేసుకున్నారు కనుక వారి ధనం మన ధనంలాంటిదే, వారి రక్తం మన రక్తం లాంటిదే."

ఒక ముస్లిం ఓ ముస్లిమేతరుడ్ని ఎలాంటి దురుద్దేశం లేకుండా హత్య చేస్తే, ఒక ముస్లిం మరోముస్లింను హత్య చేసినప్పుడు ఎలాంటి తీర్పు ఇవ్వ బడుతుందో అలాంటి తీర్పే అతనికీ ఇవ్వబడుతుంది. ఈ ఉద్దేశంతోనే పన్ను విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. *(దుర్రె ముఖ్తర్. సం. 3, పేజి. 203)*

## నేర (క్రిమినల్) చట్టాలు

ముస్లిం, ముస్లిమేతరులకు నేరశాఖ చట్టం ఒక్కటే. అందులో ఇద్దరి స్థాయీ సమానమే. ముస్లిం నేరస్థులకు ఎలాంటి శిక్షలు విధించబడతాయో, ముస్లిమేతరులకూ అలాంటి శిక్షలే విధించబడతాయి. ముస్లిమేతరుని సొమ్ము ముస్లిం దొంగిలించినా, ముస్లిం సొమ్మును ముస్లిమేతరుడు దొంగిలించినా దొంగకు హస్తఖండన శిక్ష విధించబడుతుంది. ఎవరయినా స్త్రీ లేదా పురుషునిపై వ్యభిచార నేరం మోపినవాడు ముస్లిమయినా, ముస్లిమేతరుడైనా ఇద్దరిదీ ఒకేరకమైన నేరం అవుతుంది. అలాగే వ్యభిచార శిక్ష విషయంలో కూడా ముస్లిం, ముస్లిమేతరుడు అన్న తేడా లేదు. అయితే, మద్యపాన విషయంలో మటుకు ముస్లిమేతరులను వేరుచేయడం జరిగింది.

*(కితాబుల్ ఖరాజ్ 208-209, అల్‌మబ్‌సూత్ సంపుటి 9 పేజి 57-58)*

ఇమాం మాలిక్(రహ్మ) ముస్లిమేతటుల విషయంలో మద్యపానం వలే వ్యభిచారాన్ని కూడా వేరుచేశారు. "ముస్లిమేతరులు వ్యభిచారం చేసినట్లయితే ఆ విషయం వారి మతానికే వదిలివెయ్యాల"న్న (అంటే వారి పర్సనల్‌లా ప్రకారం అమలుపరచాలన్న) హజ్రత్ అలీ(రజి), హజ్రత్ ఉమర్(రజి) గార్ల అభిప్రాయాన్ని దీనికి అయన ప్రమాణంగా చూపారు.

## పౌర (సివిల్) చట్టాలు

పౌర చట్టాలు కూడా ముస్లింలకు, ముస్లిమేతరులకు ఒక్కటే. ఉభయ వర్గాలకూ పూర్తి సమానత్వం ఉంది. హజ్రత్ అలీ(రజి) ఇలా తెలిపారు:

"ముస్లింల ధనానికి ఎలాంటి రక్షణ కల్పించబడుతుందో, అలాంటి రక్షణే వారికీ కల్పించబడుతుంది. పౌర హక్కులు మనకు, వారికీ సమానమే. "పౌర చట్టాల ద్వారా ఎలాంటి నిబంధనలు ముస్లింలపై విధించబడతాయో, అలాంటి నిబంధనలే ముస్లిమేతరులపై కూడా విధించబడతాయి. ఏ వ్యాపార పద్ధతులు మన కోసం నిషేధించబడ్డాయో, అవే వారికీ వర్తిస్తాయి. మనకు వడ్డీ ఏవిధంగా నిషిద్ధమో, అలాగే వారికీ నిషిద్ధమే. అయితే మద్యపానం, పంది విషయంలో వారు వేరు చేయబడ్డారు. మద్యపానాన్ని తయారుచేసే, త్రాగే అమ్మే హక్కు వారికి ఉంది. అలాగే పందిని పెంచే, తినే, అమ్మే హక్కు కూడా వారికి ఉంది." (అల్ మబ్సూత్ సంపుటి 13, పేజి. 37-38)

ఒక ముస్లిం ముస్లిమేతరుని మద్యాన్ని లేదా పందిని నాశనం చేస్తే, అతనిపై పన్ను తప్పనిసరి అవుతుంది. అతను వాటి మూల్యాన్ని చెల్లించాలి. (దుర్రెముఖ్తార్ సంపుటి-3, పేజి. 273)

## గౌరవ మర్యాదల రక్షణ

నోటితో లేక కాళ్ళుచేతులతో బాధించడం, తిట్టడం, కొట్టడం, పరోక్షంగా నిందించడం ముస్లింలకు ఎలా నిషిద్ధమో, అలాగే ముస్లిమేతరుల క్కూడా నిషిద్ధమే. "అతన్ని కష్టపెట్టకుండా ఉండటం వాజిబ్. ఏవిధంగా ముస్లింలపై పరోక్షనింద నిషేధమో, అలాగే వారిపై కూడా పరోక్షనింద నిషిద్ధమే." (దుర్రె ముఖ్తార్ సంపుటి 3, పేజి.273- 274)

## వాగ్దాన స్థిరత్వం

వాగ్దాన బాధ్యత ముస్లింపై శాశ్వతంగా ఉంటుంది. ముస్లిం ఒకసారి వాగ్దానం చేస్తే ఇక దానిని భంగపరచడానికి అతనికి ఎలాంటి అధికారం లేదు.

అయితే, ముస్లిమేతరులకు వాగ్దానభంగం చేసే అధికారం ఉంది. వారు తమకు ఇష్టమయినంత కాలం దానిని పాటించవచ్చు లేదా భంగపరచవచ్చు.

"వాగ్దానపాలనా బాధ్యత నెరవేర్చడం మనకు తప్పనిసరి. అంటే మనం ఒకసారి ముస్లిమేతరులతో ఒడంబడిక చేసుకున్న తరువాత దాన్నిక ఎట్టి పరిస్థితులలోనూ భంగపరచలేము. అయితే ఇది ముస్లిమేతరులకు తప్పనిసరి కాదు. (వారు మన ఒడంబడిక నుండి వేరు కాదలుచుకుంటే వేరు కావచ్చు)."

(దుర్రెముఖ్తార్ సంపుటి 7 పేజి. 112)

ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులు ఎంతపెద్ద నేరం చేసినా, వారు మనతో చేసుకున్న ఒడంబడిక భంగం కాదు. జిజ్యా చెల్లించకపోయినా, ముస్లింను హత్యచేసినా, దైవప్రవక్త (స) విషయంలో అపచారం తలపెట్టినా ఒక ముస్లిం స్త్రీని అగౌరవపరచినా వారు మనతో చేసుకున్న ఒడంబడిక భంగం కాదు. అయితే ఈ పనుల వల్ల వారిని నేరస్థులుగా పరిగణించి శిక్షించడం మాత్రం జరుగుతుంది. అంతేకాని తిరుగుబాటుదారులుగా భావించి వారిని ఒడంబడిక నుండి తొలగించడం జరగదు. అయితే రెండు సందర్భాలలో మటుకు ముస్లిమేతరులు ఒడంబడిక నుండి తొలగించ బడతారు. ఒకటి- ఇస్లామీయ రాజ్యాన్ని వదిలిపెట్టి శత్రువులతో కలిసినప్పుడు. రెండు- ఇస్లామీయ రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిపి అల్లకల్లోలం సృష్టించినప్పుడు.

*(బదాయి సంపుటి7 పేజి 113, ఫత్హుల్ ఖదీర్ సంపుటి 4 పేజి. 381, 382)*

## వ్యక్తిగత వ్యవహారాలు

ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరుల వ్యక్తిగత వ్యవహారాలు వారి పర్సనల్ లా ప్రకారమే నిర్ణయించబడతాయి. వారిపై ఇస్లామీయ పద్ధతి విధించబడదు. మన కోసం ఏ వ్యక్తిగత వ్యవహారాలు ధర్మసమ్మతం కావో, అవి ఒకవేళ వారి మతాల ప్రకారం ధర్మసమ్మతమయితే, ఇస్లామీయ ధర్మ

శాస్త్రం వారి ధర్మశాస్త్రం ప్రకారమే తీర్పునిస్తుంది. ఉదాహరణకు- మహర్, సాక్షులు లేకుండా వివాహం, గడువు కాలం పూర్తికాక ముందే రెండవ పెళ్ళి, వావివరుసలు కాని వారితో వివాహం. ఈ చర్యలన్నీ వారికి ధర్మసమ్మతమే. ఖులఫాయె రాషిదీన్ కాలంలో ఆ తరువాత కాలాల్లోనూ ఇస్లామీయ రాజ్యం అలాగే అమలుపరిచింది. హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మ) ఈ విషయంలో హజ్రత్ హసన్ బస్రీ(రహ్మ) గారిని ఇలా ఫత్వా అడిగారు:

"ఖులఫాయె రాషిదీన్ ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులను వావివరుసలు కానివారితో వివాహం, మద్యం, పంది వ్యవహారాల్లో స్వేచ్ఛగా వదిలివేశారా?" దానికి హసన్ బస్రీ (రహ్మలై) ఇలా సమాధానం రాశారు:

"వారిని మనం వారి మత విశ్వాసంపై స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించడానికే వారు మనకు జిజ్యా చెల్లించడానికి ఒప్పుకున్నారు. వెనుకటి ఆచార పద్ధతులను అనుసరించడమే మీ పని. కొత్త ఆచార పద్ధతుల రూప కల్పన మీ పని ఏమాత్రం కాదు."

కాని, ఏదయినా విషయంలో ఇరుపక్షాలవారు ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారం తీర్పుకావాలని న్యాయస్థానంలో అప్పీలు చేసుకుంటే, వారికి న్యాయ స్థానం ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారమే తీర్పునిస్తుంది. అయితే వ్యక్తిగత చట్టాలకు సంబంధించిన వ్యవహారాల్లో వాదిగాని, ప్రతివాదిగాని ముస్లిం అయితే, తీర్పు ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారమే ఇవ్వబడుతుంది. ఉదా హరణకు- ఒక క్రైస్తవ స్త్రీ ఒక ముస్లిం వివాహబంధంలో ఉంది. తరువాత ఆమె ముస్లిం భర్త చనిపోయాడు. అప్పుడు ఆ క్రైస్తవ స్త్రీ ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం భర్త మరణం తరువాత ఇద్దత్ (గడువు) కాలాన్ని పూర్తిచేయాలి. ఆమె ఇద్దత్ కాలం పూర్తికాకముందే మరోపెళ్ళి చేసుకుంటే అది వ్యర్థమవుతుంది.

(అల్‌మబ్సూత్, సంపుటి 5, పేజి. 38-41)

## మతపరమైన ఆచారాలు

ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులు తమ మతపరమైన, జాతిపరమైన ఆచార వ్యవహారాలను బహిరంగంగా నిర్వహించుకోవాలనుకుంటే తాము అధికసంఖ్యాకులుగా ఉండే ప్రాంతాలలో నిరభ్యంతరంగా నిర్వహించుకోవచ్చు. ముస్లింలు అధికసంఖ్యాకులుగా ఉండే ప్రాంతాలలో మాత్రం ఈ ఆచారాలు, ఊరేగింపులు నిర్వహించుకోవడానికి వారు ప్రభుత్వం నుండి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. ఇస్లామీయ ప్రభుత్వం అలాంటి అనుమతి ఇవ్వచ్చు లేదా నిరాకరించవచ్చు. బదాయిలో ఇలా ఉంది:

''ముస్లిమేతరులు అధికసంఖ్యాకులుగా ఉండే ప్రాంతాలలో మద్యాన్ని, పందుల్ని అమ్మకుండా, సిలువ ఊరేగింపు తీయకుండా, శంఖం ఊదకుండా మనం ముస్లిమేతరుల్ని నివారించలేము. ఇవన్నీ ముస్లింలు అధికసంఖ్యాకులుగా ఉండి జుమా, ఈద్ నమాజ్‌లు జరిగే ప్రాంతాలలో మాత్రమే అవాంఛనీయమైనవి. కాగా వ్యభిచారం, ఇతర అశ్లీల చేష్టలు వారి మతాలలో కూడా అధర్మకార్యాలే గనక వారీ చేష్టలకు బహిరంగంగా తాము అధికసంఖ్యాకులుగా ఉండే ప్రాంతాల్లో పాల్పడినా సరే ప్రభుత్వం వారిని అడ్డుకుంటుంది. *(బదాయి సంపుటి 7, పేజి. 113)*

## ఆరాధనాలయాలు

ముస్లింలు అధికసంఖ్యాకులుగా ఉండే ప్రాంతాలలోని ముస్లిమేతరుల ప్రాచీన ఆరాధనాలయాల జోలికి పోవడం జరగదు. ఒకవేళ అవి ధ్వంసమయిపోతే, వాటిని వాటి స్థానాలలోనే మళ్ళీ నిర్మించుకునే హక్కు వారికి ఉంది. కొత్త వాటిని నిర్మించుకునే హక్కు మాత్రం లేదు. *(బదాయి, సంపుటి 7, పేజి 114; షర్‌హు సైరిల్ కబీర్, సంపుటి 3, పేజి 251)*

ముస్లింలు అధిక సంఖ్యాకులుగా లేని ప్రాంతాలలో ముస్లిమేతరులకు కొత్త ఆరాధనాలయాలను కట్టుకోవడానికి సాధారణ అనుమతి ఉంది. అలాగే

జుమా, ఈద్, సామూహిక నమాజుల పరంపరను ఇమాం రద్దుచేసిన ప్రాంతాలలో కూడా కొత్త ఆరాధనాలయాలను నిర్మించుకోవడానికి, తమ ప్రచారాలు పాటించడానికి వారికి పూర్తి హక్కుంది. *(బదాయి సంపుటి 7 పేజి. 114, షర్హుల్ సైరిల్ కబీర్, సంపుటి 3 పేజి. 257)*

ఇబ్నె అబ్బాస్(రజి)గారి ఫత్వా ఇలా ఉంది:

ముస్లింలు స్థాపించిన పట్టణాలలో కొత్త ఆరాధనాలయాలను నిర్మించుకోడానికి, శంఖం ఊదడానికి, బహిరంగంగా మద్యం, పందిమాంసం అమ్మడానికి ముస్లిమేతరులకు ఎలాంటి హక్కు లేదు. దేవుడు ముస్లింలకు విజయం చేకూర్చిన పట్టణాలలో ముస్లిమేతరులు ముస్లింలకు లొంగిపోయి ఒప్పందం చేసుకున్నప్పుడు ఒప్పందంలో నిర్ణయమయిన హక్కులే వారికి వర్తిస్తాయి. ముస్లింలు వాటిని తప్పకుండా నెరవేర్చాలి.

(కితాబుల్ ఖరాజ్, పేజి. 88)

## పన్ను కప్పంలో రాయితీ ( తగ్గింపు )

పన్ను, కప్పం విషయంలో ముస్లిమేతరులపై బలవంతం చెయ్యరాదు. వారిపట్ల మెతక వైఖరి అవలంబించాలి. వారిపై దయ, సానుభూతి చూపమని తాకీదు చెయ్యబడింది. ఇంకా వారు మోయలేని భారాన్ని వారిపై వెయ్యరాదు. హజ్రత్ ఉమర్(ర) ఇలా ఉపదేశించారు:

"వారిని వారి స్థోమతకంటే ఎక్కువ చెల్లించమని బాధించకండి. పన్నుకు బదులుగా వారి ఆస్తిపాస్తులను వేలం వెయ్యరాదు. హజ్రత్ అలీ (రజి) ఒక నిర్వాహకునికి ఉత్తర్వు పంపించారు."

(కితాబుల్ ఖిరాజ్, పేజి.8,82)

పన్నుకు బదులుగా వారి గాడిదలను, ఆవులను, బట్టలను అమ్మవద్దు. (ఫత్హుల్ బయాన్ సంపుటి 4, పేజి. 93) మరో సందర్భంలో హజ్రత్ అలీ(రజి) తన నిర్వాహకుడ్ని పంపిస్తున్న సమయంలో ఇలా తెలిపారు."

"పన్ను వసూలు కోసం వారి చలికాలం మరియు వేసవి కాలపు బట్టలను, వంట సామానులను, వ్యవసాయ పశువులను ఎట్టి పరిస్థితిలోనూ అమ్మరాదు. దిర్హముల వసూలు కోసం ఎవరికీ కొరడా దెబ్బలు కొట్టరాదు. నిలబడి ఉండే విధంగా శిక్ష విధించరాదు. పన్నుకు బదులుగా ఏ వస్తువునూ వేలం వెయ్యరాదు. మనం వారికి నాయకులుగా నియమింపబడినందుకు వారిని కష్టపెట్టకుండా వసూలు చేయడమే మన పని. మీరు నా ఆదేశాలకు వ్యతిరేకంగా పనిచేసి నట్లయితే, అల్లాహ్ ప్రళయదినాన నాకు బదులు మిమ్మల్ని పట్టుకుంటాడు. మీరు నా ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్లు నాకు సమాచారం అందితే, నేను మిమ్మల్ని మీ పదవుల నుండి వెంటనే తొలగిస్తాను." *(కితాబుల్ ఖరాజ్, పే. 9)*

పన్ను వసూలు విషయంలో ఎలాంటి కఠినవైఖరి అవలంబించరాదు. హజ్రత్ ఉమర్(రజి) డెమాస్కస్ గవర్నరు హజ్రత్ అబూ ఉబీదహ్(రజి)కు వ్రాసి పంపిన ఉత్తర్వులో ఈ విషయం కూడా ఉంది.

ముస్లింలు వారిపై దౌర్జన్యం చెయ్యరాదు. ఇంకా వారిని పీడించడం, వారి ఆస్తిపాస్తులను అక్రమంగా కాజేయడం వంటి పనులు చెయ్యరాదు. ఇలాంటి పనులు ముస్లింలకు నిషేధించబడ్డాయి. *(కితాబుల్ ఖరాజ్ పే. 86)*

హజ్రత్ ఉమర్(రజి) ఒకసారి డెమాస్కస్ దేశాన్ని సందర్శించినప్పుడు అక్కడి అధికారులు ముస్లిమేతరులను పన్ను విషయమై శిక్షిస్తుండటం చూశారు. ఆయన(రజి) ఇలా అన్నారు. "మీరు వారిని కష్టపెట్టకండి. మీరు వారిని శిక్షించినట్లయితే, రేపు ప్రళయదినాన అల్లాహ్ మిమ్మల్ని శిక్షిస్తాడు." *(కితాబుల్ ఖరాజ్ పే. 71)*

ఒక ప్రభుత్వాధికారి పన్ను వసూలు విషయమై ఒక ఖిబ్తీని ఎండలో నిలబెట్టి ఉంచడాన్ని హిషామ్ బిన్ హకమ్ చూశారు. అప్పుడు ఆయన ప్రభుత్వాధికారికి చివాట్లు పెట్టి ఇలా అన్నారు. మహనీయులు ముహమ్మద్ (స) తెలియజేస్తుండగా నేను విన్నాను:

"ప్రపంచంలోని మనుష్యులను ఎవరయితే శిక్షిస్తారో, వారిని దేవుడు శిక్షిస్తాడు. అప్పు ఎగవేసేవారికి హెచ్చరికగా కాఠిన్యంలేని కారాగార శిక్ష మాత్రమే విధించడానికి ఫిఖావేత్తలు అనుమతించారు."

*(అబూదావూద్, కితాబుల్ ఖరాజ్ బాబుల్ ఫయివల్ మారహ్)*

ముస్లిమేతరుల్లో ఎవరైనా పేదలు, నిరాధారులు ఉంటే ఇస్లామీయ ప్రభుత్వం వారి నుండి వసూలుచేసే జిజ్యాపన్ను మాఫీ చేయడమే కాకుండా వారికి ఉపకార వేతనాలు కూడా మంజూరు చేస్తుంది. హజ్రత్ ఖాలిద్ (రజి) హీరా ప్రజలకు రాసిచ్చిన రక్షణ ఒప్పందంలో ఈవిధంగా ఉంది:

"ఎవరయినా వృద్ధాప్యం వల్ల బీదవారయిపోతే, లేదా వారిపై ఏద యినా ఆపద వచ్చిపడితే లేదా వారు ముందు ధనికులుగా ఉండి తరువాత బీదవారయి పోవడంవల్ల వారి జాతి వారికి దానం ఇవ్వడం ప్రారంభిస్తే వారి పన్ను క్షమించి వెయ్యండి. ఇంకా వారి కోసం వారి పిల్లల కోసం బైతుల్‌మాల్ నుండి సహాయం చెయ్యండి." *(కితాబుల్ ఖిరాజ్, పే. 85)*

వయస్సు మీరిపోయి వృద్ధాప్యం పొందిన ఒక వ్యక్తి భిక్షం అడుక్కోవ డాన్ని హజ్రత్ ఉమర్(రజి) చూశారు. అతని ఆ దుష్టపరిస్థితికి కారణం అడిగారు. అతను "పన్ను చెల్లించడానికి భిక్షం అడుక్కుంటున్నాను" అని అన్నాడు. హజ్రత్ ఉమర్(రజి) వెంటనే అతని పన్ను మాఫీ చేసి, అతని కోసం ఉపకార వేతనాన్ని మంజూరు చేశారు. తరువాత కోశాధికారికి ఇలా రాశారు:

"దైవసాక్షి! యువ్వనంలో అతనితో లాభం పొంది, వృద్ధాప్యంలో అవమానపర్చడం న్యాయంకాదు."

*(కితాబుల్ ఖరాజ్, పే. 72, ఫతహుల్ ఖదీరత్ సంపుటి 2, పే. 373)*

ఇస్లామీ రాజ్యంలోని ముస్లిమేతరులు పన్ను చెల్లించాల్సి ఉండి చనిపోతే, దానిని వారు వదిలేసిపోయిన ఆస్తినుండి గాని, వారి వారసుల నుండిగాని వసూలు చెయ్యరాదు. ఇమాం అబూయూసుఫ్(రహ్మ) ఇలా రాశారు:

"ఇస్లామీ రాజ్యంలోని ఎవరయినా ముస్లిమేతరుడు పన్ను చెల్లించాల్సి ఉండగా చనిపోతే, ఆ పన్ను అతని వారసుల నుండి వసూలు చేయడంగాని, అతని ఆస్తినుండి తీసుకోవడంగాని జరగదు."

(కితాబుల్ ఖిరాజ్, పే. 70, అల్‌మబ్‌సూత్ సంపుటి 10, పే. 81)

## వ్యాపార పన్ను

ముస్లిం వ్యాపారస్తుల వలే ముస్లిమేతర వ్యాపారస్తుల వ్యాపార వస్తువులపై కూడా పన్ను తీసుకోబడుతుంది. వారి మూలధనం 200 దిర్హములు ఉన్నా లేక 20 మిస్ఖాల్ బంగారానికి యజమానులు అయినా పన్ను చెల్లించాలి. (కితాబుల్ ఖరాజ్ పే. 70. ఈ రోజు కూడా ఆ లెక్క ప్రకారమే పన్ను వసూలు చెయ్యాలని నిబంధన ఏమీ లేదు. ఈ లెక్క ఆ కాలపు పరిస్థితుల ప్రకారం నిర్ణయించింది). ధర్మశాస్త్రవేత్తలు ముస్లిమేతర వ్యాపారస్తులపై వ్యాపార పన్ను 5 శాతంగా, ముస్లింలపై 2 1/2 శాతంగా నిర్ణయించారు. అయితే, ఈ చర్య నిష్కర్షంగా చేసిందికాదు. అది ఆ కాలపు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చేసింది. ముస్లింలు ఆ కాలంలో దేశరక్షణలో నిమగ్నమై ఉన్నారు. వ్యాపారం మొత్తం ముస్లిమేతరుల పరమైఉండింది. ముస్లిం వ్యాపారస్తులకు ధైర్యాన్ని ఇవ్వడానికి, ఇంకా వారి వ్యాపార రక్షణ కోసం వారి విషయంలో పన్ను తగ్గించడం జరిగింది.

## సైనికుల సేవలు- అపవాదం

ముస్లిమేతర సైనికుల సేవల విషయంలో అపవాదం ఉంది. శత్రువుల నుండి దేశాన్ని రక్షించే బాధ్యత ముస్లింల విధులలో చేర్చబడింది. ఎందుకంటే ఒక చట్టంద్వారా ఒక రాజ్యాన్ని స్థాపిస్తే, ఆ చట్టం యదార్థ మైనదిగా భావించినవారే దాని రక్షణ కోసం యుద్ధం చెయ్యగలరు. వారే చెయ్యాలి కూడా. అలాగే ఆ దేశ యుద్ధ నియమ నిబంధనల ఏర్పాటు కూడా వారే

చెయ్యగలరు. ఒకవేళ వేరేవారు ఆ రాజ్య రక్షణ కోసం యుద్ధం చేస్తే, వారు కేవలం అద్దె సైనికుల వలే యుద్ధం చేస్తారు. వారు ఇస్లాం స్థాపించిన నీతి నిజాయితీల ఏర్పాటు చెయ్యలేరు.

అందువల్ల ఇస్లాం ముస్లిమేతరులను సైనిక సేవల నుండి వేరు పరిచి, దేశరక్షణలో తమ వంతు పనిచెయ్యాలని విధిగా చేసింది. పన్ను వాస్తవ స్థితి కూడా ఇదే. ఇది కేవలం భక్తి వినయానికి గుర్తే కాకుండా, సైనిక సేవల అపవాదం నుండి వేరుపరుస్తుంది. ఇంకా దేశరక్షణ ప్రతిఫలం కూడా అవు తుంది. కావున యుద్ధ నేర్పుగల పురుషులపై మాత్రమే పన్ను విధించబడు తుంది. ఏదయినా సమయంలో ముస్లింలు ముస్లిమేతరులకు రక్షణ కల్పించలేకపోతే, వారి పన్ను వాపసు చేయబడుతుంది. *(ఈ సమస్యపట్ల ఇంకా క్షుణ్ణంగా తెలుసుకోదలిస్తే- మబ్సూత్ సంపుటి 10 పే. 78, 79, హిదాయ కితాబుస్సైరి ఫసల్ ఫీ కైఫియతి ఖిస్మతుల్ గనాయిమ్ వ బాబుల్ జిజియ, ఫత్హుల్ ఖదీర్ పే. 327- 328, 369-370)*

యర్మూక్ యుద్ధ సమయంలో రోమన్‌లు ముస్లింలకు వ్యతి రేకంగా పెద్ద సైన్యాన్ని ప్రోగుచేశారు. అప్పుడు ముస్లింలు డెమాస్కస్‌లో జయించిన అన్ని ప్రాంతాలను వదిలేసి ఒకే కేంద్రంలో తమ శక్తిసామర్థ్యాలను వెచ్చించవలసి వచ్చింది. ఆ సమయంలో హజ్రత్ అబూ ఉబేదహ్(రజి) తమ అధికారులకు ఇలా రాశారు: "'ఏ కప్పం, పన్ను మీరు ముస్లిమేతరుల నుండి వసూలు చేశారో, దానిని తిరిగి ఇచ్చివెయ్యండి. ఇంకా వారితో చెప్పండి. ఇప్పుడు మేము మీకు రక్షణ కల్పించలేని స్థితిలో ఉన్నాము. అందువల్ల మీ రక్షణ కోసం వసూలు చేసిన ధనాన్ని మీకు తిరిగి ఇచ్చి వేస్తున్నాము."

(కితాబుల్ ఖరాజ్. పే- 111)

ఈ ఆదేశం ప్రకారం ప్రోగయి ఉన్న మొత్తం ధనాన్ని సైనికాధికారులు తిరిగి ఇచ్చివేసారు. ఆ సమయంలో బిలాజురి ముస్లిమేతర ప్రజల భావాలను

రాస్తూ..... అప్పుడు ముస్లింలు ముస్లిమేతరుల పన్నులను తిరిగి ఇచ్చివేస్తే అక్కడ నివసించే వారందరూ ముక్తకంఠంతో ఇలా అన్నారు: "మీ అధికారం, న్యాయపరిపాలన మేము అనుభవించిన అత్యాచార బలాత్కారము కంటే ఎంతో ప్రీతికరమైనది. ఇప్పుడు మేము హర్ఖల్ అధికారులను మా పట్టణా లలోకి చొరబడనీయము. ఇంకా మేము వారిని జయించేవరకు యుద్ధం చేస్తూనే ఉంటాము. *(ఫుతూహుల్ బుల్దాన్ పే. 137, యూరప్ ముద్రణ)*

## అధ్యాయం- 3

# ఇస్లాం ధర్మవేత్తలు- రక్షణ

ఇవన్నీ ఇస్లామీ రాజ్యంలోని ముస్లిమేతర ప్రజల హక్కులు, విధుల గురించి ప్రారంభ దశలో తయారుచేసిన చట్టాలు, వాటి వివరాలు. ఇప్పుడు మరికొన్ని విషయాలను తెలియజేసి ముందుకెళ్తాను. ఖులఫాయెరాషిదీన్‌ల పరిపాలన తరువాత రాజుల కాలంలో ముస్లిమేతరులపై ఎప్పుడైనా ఏదైనా అన్యాయం జరిగితే, ఇస్లాం ధర్మవేత్తల సంఘమే వారి రక్షణ కోసం నడుం బిగించి వారికి తోడుగా నిలిచింది. ఒక చారిత్రాత్మక సంఘటన చూద్దాం. వలీద్ బిన్ అబ్దుల్ ముల్క్ ఉమవి ఒకసారి క్రైస్తవుల ప్రార్థనా స్థలాన్ని బల వంతంగా మసీదులో కలుపుకున్నారు. రాజ్యసింహాసనంపై అప్పట్లో హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్(రహ్మా) కొలువై ఉన్నారు. క్రైస్తవులు వెళ్ళి తమపై జరిగిన దౌర్జన్యాన్ని ఖలీఫాతో విన్నవించుకున్నారు. అప్పుడు హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మా) తమ నిర్వాహకులకు ఇలా రాశారు: "మసీదు యొక్క ఎంతభాగం క్రైస్తవుల ప్రార్థనామందిరంలో నిర్మించబడిందో, ఆ భాగాన్ని శిథిలం చేసి వారికి అప్పగించండి. *(ఫుతూహుల్ బుల్దాన్ యూరప్ ముద్రణ పే. 132)*

వలీద్ బిన్ యజీద్ రోమన్‌ల దాడి భయంవల్ల ఖబరన్‌లోని ముస్లిమే తరులను దేశం నుండి బహిష్కరించి డెమాస్కస్ దేశానికి పంపించాడు. అందుకు సాధారణ ముస్లింలు, ధర్మవేత్తలు ఎంతో అసంతృప్తి చెందడమే కాకుండా దానిని ఒక పెద్ద నేరంగా భావించారు. అప్పుడు యజీద్ బిన్ వలీద్ వారిని తిరిగి ఖబరస్‌కు పంపించాడు. ఆ సమయంలో అతనికి అసాధారణ మైన ప్రశంసలు లభించాయి. వాస్తవానికి ఇదే నిజమైన న్యాయం అని అందరూ అన్నారు. ఇస్మాయిల్ బిన్ అయ్యాష్ ఇలా తెలిపారు.

అతని ఈ ప్రవర్తనతో ముస్లింలు ఎంతో విసుగుచెందారు. ధర్మవేత్తలు దానిని నేరంగా భావించారు. యజీద్ బిన్ వలీద్ ఖలీఫాగా వారిని వెనుకకు

(ఖబరన్‌కు) పంపించి వేయగా, ముస్లింలు దానిని ఎంతగానో ఇష్టపడ్డారు. ఇంకా ఇదే సరైన న్యాయం అన్నారు. *(ఫతుహుల్ బల్‌దాన్ పేజి. 156)*

బలాజురి ఇలా తెలిపాడు: ఒకసారి జబలె లుబ్‌నాన్ ప్రజలతో ఒక వర్గం వారు తిరుగుబాటు చేశారు. అప్పుడు సాలిహ్ బిన్ అలీ బిన్ అబ్దుల్లాహ్ వారికి బుద్ధి చెప్పడానికి పెద్ద సైన్యాన్ని పంపించాడు. వారు (సైన్యం) ఆయుధాలను ఎత్తే పురుషులను హతమార్చారు. మిగిలిన వారిలో కొందరిని దేశ బహిష్కరణ చేసి, మరికొందరిని అక్కడే వదిలేసారు. ఇమాం అవ్‌జాయి ఆ సమయంలో జీవించి ఉన్నారు. వారు ఈ దుశ్చర్యపై సాలిహ్‌కు చివాట్లు పెట్టి ఒక పెద్ద ఉత్తరాన్ని రాశారు. అందులోని కొన్ని వచనాలు ఇలా ఉన్నాయి.

జబలెలుబ్‌నాన్ ప్రజల దేశబహిష్కరణ స్థితిగతులు నీకు తెలుసు. వారిలో కొందరికి తిరుగుబాటు చేసేవారితో ఎలాంటి సంబంధం లేదు. అయినా నీవు వారిలో కొందరిని హత్యచేశావు. కొందరిని వారి ఊర్లనుండి వెనక్కి పంపించావు. అయినా, కొందరు వ్యక్తుల అపరాధపు శిక్ష సాధారణమైన వ్యక్తు లకు ఎలా ఇవ్వబడుతుంది. ఇంకా వారిని ఏ ఉద్దేశంతో వారి ఇండ్ల నుండి, ఆస్తిపాస్తుల నుండి వేరు చెయ్యగలం? అయినా దేవుని ఆదేశం ఇలా ఉంది.

ఇది తప్పకుండా ఆచరించవలసిన విధి. మీ కోసం ఉత్తమమైన ఉపదేశం ఏమిటంటే- ప్రవక్త(స) తెలిపారు:

"ఎవరయినా సంధి కుదుర్చుకున్నవారిపై దౌర్జన్యం చేసినా, వారిపై వారి స్థోమతకంటే ఎక్కువ భారం వేసినా, నేను స్వయంగా వారికి వ్యతిరేకంగా వాదినవుతాను." (ఫుతూహుల్**బల్**దాన్- 169)

ఇలాంటి ఉదాహరణలు చరిత్రలో మనకెన్నో లభిస్తాయి. ఇస్లాం ధర్మవేత్తలు ఎప్పుడూ వారి హక్కులను రక్షిస్తూ వచ్చారన్న విషయం మనకు తెలుస్తుంది. అలాగే ఏ ధనికుడైనా, రాజయినా ఇస్లాం ధర్మానికి వ్యతిరేకంగా వారిపై దౌర్జన్యంగాని, బలవంతంగాని చేసినట్లయితే ధర్మవేత్తలు వాటిని తిరస్కరించకుండా ఉండలేదు.

అధ్యాయం- 4

# ముస్లిమేతరులు - అదనపు అధికారాలు

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం బాధిత ప్రజలకుగల అధికారాల గురించి ఇప్పటివరకు తెలుసుకున్నాం. వీటిని ప్రతి ధర్మశాస్త్రమూ తప్పకుండా ఆచరించాలి.

ప్రస్తుత కాలంలో ఒక ఇస్లామీ రాజ్యం తన ముస్లిమేతర పౌరులకు ఇవ్వగల అదనపు అధికారాల గురించి తెలుసుకుందాం.

## ప్రభుత్వ నాయకుని పదవి

ముందుగా ప్రభుత్వ నాయకుడి సమస్యను తీసుకుందాం. ఇస్లామీయ ప్రభుత్వం ఒక చట్టబద్ధమైన ప్రభుత్వం కావడంవల్ల వంచకులతో పని చేయించుకోలేదు. ఇస్లాం ధర్మంలో ప్రభుత్వ నాయకుని ఘనత ఏమిటంటే, అతను ఇస్లాంలో ఇస్లామీయ చట్టం ప్రకారమే రాజ్యపరిపాలన నడపాలి. కాబట్టి ఎవరయితే ముందునుండే ఇస్లామీయ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారో, వారు ప్రభుత్వ నాయకుని పదవిని ఎన్నటికీ సంభాలించలేరు.

## శాసనసభా సంఘం

దీని తరువాత మన ముందు శాసనసభా సంఘం లేదా పార్లమెంటు సమస్య వస్తుంది. ఇస్లాం సిద్ధాంతం ప్రకారం శాసనసభ సంఘంలో కూడా ముస్లిమేతరులను నియమించడం సరియైనదికాదు. అయినా ప్రస్తుత పరిస్థితులలో దీనికోసం ఒక ప్రత్యేకమైన అవకాశం కల్పించబడుతుంది. అయితే ప్రభుత్వ చట్టంలో క్రింది విషయాల పట్ల సరియైన బాధ్యత, పూచీ తప్పకుండా ఉండాలి.

(అ) ఖుర్‌ఆన్ మరియు హదీసుకు వ్యతిరేకంగా ఎలాంటి చట్టాన్ని తెచ్చే అధికారం పార్లమెంటుకు లేదు. ఏదయినా తీర్మానం చట్టపు హద్దుమీరితే దానికి చట్టపరమైన అధికారపత్రం లభించరాదు.

(ఆ) దేశచట్టాలు, నియమాలకు మూలాధారం ఖుర్‌ఆన్ మరియు సున్నత్.

(ఇ) చట్టాలకు తుది మార్పుచేర్పులు చేసేవాడు ముస్లిం అయి ఉండాలి.

ముస్లిమేతరులను పార్లమెంటులో చేర్చే బదులు వారికోసం ఒక వేరే అసెంబ్లీ ఏర్పాటు చెయ్యాలి. దీనివల్ల వారు తమ సామూహిక అవసరాలు తీర్చుకోగలరు. అలాగే తమ దేశ పరిపాలన విషయంలో కూడా తమ దృష్టిని సారించగలరు. దీనిని ముస్లిమేతర సభ్యులకోసం, వారి అభిప్రాయాల కోసం ప్రత్యేకించాలి. తమ అభిప్రాయాలను వెల్లడించడానికి వారికి పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కల్పించాలి. ఈ అసెంబ్లీ వల్ల:

1. తమ స్వంత విషయాలలో శాసనాలను ప్రతిపాదించుటకు, మును పటి శాసనాలను చక్కదిద్ది వాటిని సంస్కరించుటకు వారికి పూర్తి అధికారం ఉంటుంది. ఇలాంటి అన్ని ప్రతిపాదనలు ప్రభుత్వ అధికారి అంగీకారంతో చట్టాలు శాసనాలుగా ఏర్పడుతాయి.

2. వారు ప్రభుత్వ పరిపాలన, శాసనసభా సంఘ తీర్మానాల విష యంలో తమ ఆరోపణలు, అభ్యంతరాలు, సలహాలు మరియు ప్రతిపాదన లను స్వయంగా ప్రవేశపెట్టగలరు. ప్రభుత్వం వాటిపై యదార్థంగా ఆలోచిస్తుంది.

3. వారు తమ సమాజం, దేశ సాధారణ విషయాలకు సంబంధించిన ప్రశ్నలను కూడా వెయ్యగలరు. వారి సందేహాలను తీర్చడానికి ప్రభుత్వం తరపున ఒక వ్యక్తి నియమించబడి ఉంటాడు.

ఈ మూడు చట్టాలలో వీలును, అవసరాన్ని బట్టి ఏ చట్టాన్ని అయినా అవలంబించవచ్చు.

గ్రామ, స్థానిక సమావేశాల విషయంలో ముస్లిమేతరులు సభ్యులుగా ఉండటానికి, వారి అభిప్రాయాలను తెలుపడానికి వారికి పూర్తిహక్కును కల్పించవచ్చు.

## వ్రాతపూర్వకమైన మరియు వాక్ స్వాతంత్ర్యం

ఈ రాజ్యంలో రాత, వాక్కు మరియు అభిప్రాయాలు వెలిబుచ్చే విషయంలో ముస్లింలకు గల స్వాతంత్ర్యమే ముస్లిమేతరులకూ ఉంటుంది. ఈ విషయంలో ముస్లింలకు ఏ చట్టబద్ధమైన నిబంధనలు వర్తిస్తాయో అవే ముస్లిమేతరులకూ వర్తిస్తాయి. వారు చట్టపు హద్దులలో ఉంటూ ప్రభుత్వం పైన, వాటి ఉత్తర్వుల పైన మరియు ప్రభుత్వాధికారిపైన స్వేచ్ఛగా సమీక్ష చెయ్యగలరు.

చట్టపు హద్దులకు లోబడి మతసంబంధమైన వాదన, సంభాషణలలో ముస్లింలవలే ముస్లిమేతరులకు కూడా స్వేచ్ఛ ఉంటుంది.

ముస్లిమేతరులకు తమ మతపరమైన విషయాలను ప్రచారం చెయ్యడానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. ఒక ముస్లిమేతర మతస్థుడు, మరో ముస్లిమేతర మతాన్ని స్వీకరిస్తే ప్రభుత్వం తరపున ఎలాంటి అభ్యంతరం ఉండదు. అయితే ఒక ముస్లిం, ఇస్లామీయ రాజ్యంలో ఉంటూ, తన మతాన్ని మార్చుకునే అధికారం ఆ ముస్లింకు లేదు. కాని ఇస్లాం ధర్మాన్ని వీడినప్పుడు పూర్తి బాధ్యత మతభ్రష్టునిపై మాత్రమే ఉంటుంది. ఏ ముస్లిమేతరుని వల్ల అతను మతభ్రష్టుడు అయ్యాడో, అతనిపై ఎలాంటి బాధ్యత ఉండదు.

తమ అభిప్రాయాలకు వ్యతిరేకంగా మరో మతవిశ్వాసాన్ని అవలంబించమని వారిని బలవంతం చెయ్యరాదు. దేశచట్టానికి ఆటంకం కానటువంటి పనులను తమ అభిప్రాయం ప్రకారం ఆచరించే అధికారం వారికి ఉంటుంది.

## విద్య

దేశం మొత్తంలో ఏ విద్య ఉంటుందో, వారికీ అదే విద్య అమలవుతుంది. అయితే, మతపరమైన ఇస్లామీ విద్య విషయంలో ఎలాంటి బలవంతం చెయ్యడం జరగదు. దేశ విద్యాలయాలలో తమ స్వంత విద్యాలయాలలో తమ మత విద్యను ఏర్పాటు చేసుకొనుటకు వారికి పూర్తి హక్కు ఉంటుంది.

## ఉద్యోగాలు

కొన్ని సురక్షితమైన ఉద్యోగాలు తప్ప మిగిలిన అన్ని ఉద్యోగాలలో ప్రవేశించడానికి వారూ హక్కుదారులే. ఈ విషయంలో వారితో ఎలాంటి పక్షపాతం వహించడం జరగదు. ముస్లిం, ముస్లిమేతరులకు యోగ్యతా ప్రమాణాలు ఒకేవిధంగా ఉంటాయి. ఇంకా ఎలాంటి భేదభావం లేకుండా ఎన్నుకోవడం జరుగుతుంది.

సురక్షితమైన పదవులు అంటే ఇస్లాం యొక్క చట్టబద్ధమైన పరిపాలనలో ముఖ్యమైన పదవులు. పండితుల ఒక నమూహం ఎంతో ఆలోచించి ఈ పదవుల జాబితాను తయారుచేశారు. ఏ సేవల సంబంధం రాజ్యాంగపరమైన మార్గదర్శనంతో ముడిపడి ఉన్నాయో, అవన్నీ ప్రాముఖ్యత గల ముఖ్యమైన సేవలే. ఒక చట్టబద్ధమైన పరిపాలనలో, ఆ చట్టంపై పూర్తి విశ్వాసం, నమ్మకంగల వారికే దాని సేవలు అప్పగించబడతాయి. ఈ సేవలను నిపాతనం చేసిన తరువాత మిగిలిన వ్యవస్థలోని పెద్దపెద్ద పదవులలో కూడా ప్రజలను తమ యోగ్యతానుసారం నియమించడం జరుగుతుంది.

**ఉదాహరణకు:** అకౌంటెంట్ జనరల్, చీఫ్ ఇంజనీర్, పోస్ట్‌మాస్టర్ జనరల్ వంటి పదవులలో సైతం వారిని నియమించడానికి ఎలాంటి ఆక్షేపణ, నిషేధం లేదు.

అలాగే, సైన్యంలో కేవలం యుద్ధసేవలు మాత్రమే సురక్షితమైన పదవుల క్రిందకి వస్తాయి. సైన్యపు మిగిలిన శాఖలలో ముస్లిమేతరులను ఎలాంటి అభ్యంతరం లేకుండా నియమించవచ్చు.

## ఆర్థిక వ్యవహారాలు, వృత్తులు

వృత్తి, చేతిపని, వ్యాపారం, వ్యవసాయం మరియు ఇతర అన్నిరకాల వృత్తిద్వారాలు ముస్లిమేతరుల కొరకు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. వీటిలో ముస్లిమేతరులకు లేని ఎలాంటి ఉపశమనం ముస్లింలకు ఉండదు. అలాగే, ముస్లింలపై లేని ఎలాంటి నిబంధన ముస్లిమేతరులపై విధించడమూ జరగదు. ఆర్థిక మైదానంలో ప్రతి పౌరునికీ అతను ముస్లిం అయినా, ముస్లిమేతరుడు అయినా సమానమైన హక్కు లభిస్తుంది.

## ముస్లిమేతరుల రక్షణ చట్టం

చివరిలో ఈ విషయం గురించి కూడా విశదీకరించడం తప్పనిసరి. అదేమంటే- ఒక ఇస్లామీయ రాజ్యం తన ఇరుగు పొరుగున ఉన్న ముస్లిమేతర రాజ్యాలు తోటి ముస్లిం ప్రజలకు ఎలాంటి హక్కులు కల్పించి, ఎలాంటి హక్కులు కొల్లగొడుతున్నారో చూసి, దానిప్రకారం తమ తోటి ముస్లిమేతరులకు హక్కులు కల్పించడం జరగదు. ముస్లింలు ముస్లిమే తరులను చూసి తమ ప్రణాళిక రచన తయారు చేసుకోవడాన్ని, వారు న్యాయం చేస్తే వీరూ న్యాయం చేయడాన్ని, వారు అత్యాచారాలు జరిపితే వీరూ జరపడాన్ని మేము ఎన్నటికీ ఒప్పుకోము. మనం ముస్లింలం. స్పష్టమైన, ఖచ్చితమైన చట్టంపై నడిచేవాళ్ళం. మనం ఎప్పుడూ చట్టపరమైన హద్దులలోనే పనిచెయ్యాలి. ప్రతిదీ మంచి సంకల్పంతోనే చేయాలి. ఏది కూడా కాగితాలకు పరిమితం కాకుండా చేతలతో చేసి చూపాలి. అలాగే తీసుకున్న బాధ్యతలను నీతి నిజాయితీతో ఖచ్చితంగా నెరవేర్చాలి.

దౌర్జన్యం, ప్రతి దౌర్జన్యాలు దురదృష్టవశాత్తు ఒక పెద్ద భూభాగంలో దర్శనమిస్తున్నాయి. అవి కేవలం ఇస్లామీ రాజ్యం వల్ల మాత్రమే దూరం కాగలవు. పాకిస్తాన్ కూడా శాంతియుతమైన దేశం కాగలదు. అలాగే ఇండియన్ యూనియన్‌కు కూడా సరైన మార్గం లభిస్తుంది. విచారకరమైన విషయం ఏమిటంటే- ముస్లిమేతరులు ఒక యుగం నుండి ఇస్లాం గురించి తప్పుగా వింటూ, చూస్తూ వస్తున్నారు. అందువల్ల వారు ఇస్లామీ రాజ్యం పేరు వినగానే భయపడిపోతున్నారు. ఇక్కడ కూడా ఇండియన్ యూనియన్ వలే ఇస్లామేతర ప్రజాస్వామ్యం స్థాపించాలని వారిలో కొందరు గోల చేస్తున్నారు. ఇండియన్ యూనియన్ ముస్లింలు చవిచూస్తున్న దానిని వారు బలవంతం చేసి దానిని ఇక్కడే స్వయంగా పరిశోధించాలని అనుకోవడం మాకెంతో ఆశ్చర్యంగా ఉంది. దానిని ఆకాంక్షించడానికి వాస్తవానికి ఇదేమయినా అంత మనోజ్ఞమైన (ఇంపైన) విషయమా? దానికి బదులుగా దైవభీతి, నీతి నిజాయితీ, చట్టాలను అమలు పరిచే శాశ్వతమైన పరిపాలన గురించి పరిశోధించడం బాగుండదా?

-: సమాప్తం :-